మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మధుసూదన్



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మధుసూదన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హనుమాన్‌గౌడ్ ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మధుసూదన్ మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు నూతన ఇన్‌స్పెక్టర్‌కు స్వాగతం పలికి, బదిలీపై వెళ్తున్న హనుమాన్‌గౌడ్‌కు వీడ్కోలు పలికారు.

స్కూళ్లలో రక్షా బంధన్



రాఖీలు కడుతున్న విద్యార్థులు

మేడ్చల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా చేపట్టారు. విద్యార్థులు సీనియర్, తమ తోటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు రాఖీలు కట్టారు. పలు స్కూళ్లలో విద్యార్థులకు రాఖీ తయారీ పోటీలు నిర్వహించారు.

వేర్వేరు ఘటనల్లో గుర్తు తెలియని ఇద్దరి మృతి

మల్కాజిగిరి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతపురికాలనీకి చెందిన జలంధర్ గురువారం మధ్యాహ్నం తన ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తి (58) పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు 100 ద్వారా సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఎడమ చేతిపై రేణుక నర్సయ్య అనే పేరుతో పచ్చబొట్టు ఉందని ఆచూకీ గుర్తించిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

మరోచోట..

మల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్ డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌లో యాచకుడు (55) మృతిచెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంబంధీకులు నాచారం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అన్నార్తులు ఉన్నచోటే రూ.5 భోజన శిబిరం ఏర్పాటు



మౌలాలి: డివిజన్ పరిధిలోని సుధానగర్ ప్రధాన రహదారిపై రూ.5 భోజన శిబిరం ఏర్పాటు చేయడాన్ని సుధానగర్, వీవీఆర్ గార్డెన్ అపార్ట్‌మెంట్‌వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గురువారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి కార్పొరేటర్ సునీత మద్దతు ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకునేవారే అధికంగా ఉన్నారని, నిరుపేదలు ఉండే చోట శిబిరం ఏర్పాటు చేస్తే వారి ఆకలి తీరుతుందన్నారు. సంబంధిత అధికారుల ఏకపక్ష నిర్ణయాలు సరికాదని, తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని స్పష్టం చేశారు. దీనిపై త్వరలోనే సంబంధిత ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందిస్తానని వివరించారు.

'రక్తహీనత సమస్యను నివారించవచ్చు'



మల్కాజిగిరి: బాలికలు, యువతుల్లో రక్తహీనత అనే ఆరోగ్య సమస్య నివారించవచ్చని డాక్టర్ కెకె క్యాన్సర్ కేర్ అండ్ సపోర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. కె.కరుణకుమార్ అన్నారు. గురువారం సెయింట్ ఆన్స్ స్కూల్‌లో రక్తహీనత నివారణ నియంత్రణకు ఉచిత స్క్రీనింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే తగినంత పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల రక్తహీనత భారిన పడకుండా ఉంటామన్నారు.

కలెక్టర్ ఆరా..!

ఆకస్మిక తనిఖీలతో జిల్లా అధికారుల్లో హడల్

ఆరా పదానికి చాలా అర్థాలే ఉన్నాయి. తెలుగులో ఆరా అంటే కూపీ లాగడం... ఇంగ్లిషులో ఆరా అంటే ఆయన చుట్టు ప్రత్యేకమైన వాతావరణం ఉండటం.. హిందీలో ఆరా అంటే వస్తున్నాడని అర్థం. ఇవన్నీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి వర్తిస్తాయనే చెప్పాలి. క్షేత్రస్థాయి పర్యటనలు.. ఆకస్మిక తనిఖీలు.. సమస్యల గుర్తింపు.. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులతో సమీక్షలు... వసతుల కల్పనకు నిధుల మంజూరు వంటి పక్కా ప్రణాళికతో బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే తన మార్క్ పనితీరును చూపిస్తున్నారు. ఇప్పుడిది అధికార, ఉద్యోగుల్లో వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ (ఫైల్)

సాక్షి,మేడ్చల్‌జిల్లా: ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో కలెక్టర్ మనుచౌదరి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీలకు ఆ ప్రాంతానికి వెళ్లిన తర్వాతనే సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు సమాచారం అందుతోంది. దీంతో వారంతా అప్రమత్తంగా ఉంటూ ఉద్యోగులు, సిబ్బందిని అలర్ట్ చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన ప్రణాళికతో నిధులు మంజూరు చేస్తూ పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు.

సమస్యలు తెలుసుకున్న వెంటనే నిధులు మంజూరు చేస్తూ..

ఇప్పటి వరకు మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి రూ.2 కోట్లు, పాలిటెక్నిక్ భవనం కోసం రూ.2 కోట్లు, కూకట్‌పల్లి యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులను ఆయన మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవనాలకు అవసరమైన చోట ప్రభుత్వ స్థలాల కేటాయింపులో కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ, పీహెచ్‌సీలకు నేరుగా వెళ్లి...

ఘట్‌కేసర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, కీసర పీహెచ్‌సీ, కూకట్‌పల్లి, తూంకుంట, షాపూర్, మూసాపేట యూపీహెచ్‌సీలు, మల్కాజిగిరి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు, గర్భిణులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా.. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా.. లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఆస్పత్రుల్లో ఓపీ ఎలా నడుస్తోంది.? గర్భిణుల సంఖ్య ఎంత ఉంటుంది..? వారందరూ పరీక్షల కోసం వస్తున్నారా..? రానట్లయితే వైద్య పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారు.? వారిని పీహెచ్‌సీలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారా..? అని ఆరా తీస్తున్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విస్తృత తనిఖీలు..

జగ్గంగూడ, శామీర్‌పేట, కీసర, ఉప్పల్, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లోని రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల్లో కలెక్టర్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా..? గదులు, బాత్‌రూమ్‌లు సరిగ్గా ఉన్నాయా? లేవా అని తెలుసుకుని సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. మల్కాజిగిరి డిగ్రీ కళాశాలతో సహా పలు ఇంటర్ కళాశాలల్లో కలెక్టర్ పర్యటించి పలు పరిష్కారాలు చూపించారు. సొంత భవనాలు ఉన్న 400 అంగన్వాడీ కేంద్రాలకు పెయింట్స్ (రంగులు) బొమ్మల పెయింటింగ్స్ వేయించారు. కేంద్రాల ఆవరణలో కూరగాయలు, పూల మొక్కలు పెంచాలని ఆదేశాలిచ్చారు.

కలెక్టర్ పర్యటనలతో అధికారుల అప్రమత్తం..

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు, క్షేత్రస్థాయి పర్యటనలతో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. తమ శాఖ పరిధిలోని ఉద్యోగులు,సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచిస్తున్నారు. విధి నిర్వహణలో చురుకుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆస్పత్రులు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నారు. ప్రభుత్వ పరంగా అందుతున్న వాటన్నింటిని సక్రమంగా వినియోగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



అవినీతి ఉద్యోగుల్లో మొదలైన వణుకు..

కలెక్టర్ మనుచౌదరి అవినీతి, అక్రమాలను సహించరనే సంకేతాలు అన్ని శాఖలకు తెలియడంతో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిలో వణుకు మొదలయ్యింది. దీంతో పురపాలక సంఘాల్లో అక్రమ భవన నిర్మాణాలు జరగకుండా సంబంధిత ఉద్యోగులు జాగ్రత్త పడుతున్నారు. అక్రమ భవనాలు, లేఅవుట్లు ఉంటే వారికి నోటీసులు ఇస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో జిల్లా అధికారులందరూ హాజరయ్యేలా చేపట్టిన చర్యలు విజయవంతం దిశగా కొనసాగుతున్నాయి. మహిళా గ్రూపుల పనితీరుతో సహా వ్యవసాయ, ఉద్యావన పంటల పరిస్థితి, పురపాలక సంఘాల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, డంపింగ్ యార్డుల నిర్వహణపై ఆరా తీస్తుండటంతో కమిషనర్లు జాగ్రత్త పడుతున్నారు.

ఫీవర్ సర్వే తీరుపై ఆగ్రహం...

సీజనల్ వ్యాధులను అరికట్టడానికి ఫీవర్ సర్వే నత్త నడకన సాగడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చొరవ తీసుకుని 40 శాతం జరిగిన ఫీవర్ సర్వేలో వేగాన్ని పెంచారు. వ్యాధుల నివారణకు వైద్య శిబిరాల నిర్వహణ తదితర విషయాలతో సహా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ, నకిలీ డాక్టర్ల బెడదపై జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులతో సహా ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

కర్మాగారాల్లో భద్రతా వ్యవస్థలను మెరుగుపర్చాలి

అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి,సిటీ బ్యూరో: రసాయన, ఔషధ కర్మాగారాల్లో ప్రమాదాల నివారణ, భద్రతా వ్యవస్థలను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. గురువారం రసాయన, ఔషధ కర్మాగారాల్లో భద్రతపై జరిగిన సమావేశంలో ఆమె మట్లాడారు. సిగాచి పరిశ్రమలలో భారీ పేలుడు, అగ్నిప్రమాదాల కారణంగా అధిక ప్రాణనష్టం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. శానిటైజేషన్ కార్యక్రమం కింద కర్మాగారాలను తనిఖీ చేయడానికి ప్రభుత్వం కర్మాగారాలు, పరిశ్రమలు, బాయిలర్లు, కార్మిక, కాలుష్య నియంత్రణ బోర్డు, అగ్నిమాపక సేవల విభాగాలతో కూడిన జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తుందన్నారు. మొదటి దశలో రసాయన ఫార్మా కర్మాగారాలు, అనంతరం ఇతర ప్రమాదకర కర్మాగారాలను సందర్శించాలని ఆమె ఆదేశించారు.

ఫ్యాక్టరీ నిర్వహణతో సమన్వయం

ఫ్యాక్టరీ నిర్వహణతో స్థానిక పారిశ్రామిక క్లస్టర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆమె జిల్లా కమిటీని ఆదేశించారు. అన్ని వర్గాల పరిశ్రమలకు సరిపోయే వివిధ భద్రతా మాడ్యూళ్లను అభివృద్ధి చేయాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు. ఫ్యాక్టరీల డైరెక్టర్ మోహన్‌బాబు మాట్లాడుతూ.. భద్రత అమలులో ఎలాంటి రాజీపడలేదని, తనిఖీల సమయంలో యాజమాన్యాలకు ఎలాంటి వేధింపులు ఉండవని స్పష్టం చేశారు. మనిషి ప్రాణాలను కాపాడేందుకు అంతర్నిర్మిత భద్రతా వ్యవస్థలను అభివద్ధి చేయాలని సూచించారు. భద్రతా ఉపశమన వాల్వ్‌లు, రియాక్టర్లకు పగిలి పోయే డిస్క్‌లు వంటి ఏవైనా లోపాలను వెంటనే సరిదిద్దాలని యాజమాన్యాలను సూచించారు. బాయిలర్ల డైరెక్టర్ శ్రీనివాసరావు, మేడ్చల్, మల్కాజ్‌గిరిలోని ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్‌రెడ్డి, కార్మిక, కాలుష్య నియంత్రణ బోర్డు, పరిశ్రమలు, అగ్నిమాపక విభాగాల అధికారులు, ఫ్యాక్టరీ యాజమాన్యాలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ సూచించారు. జన సురక్ష కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ మున్సిపాలిటీ మీటింగ్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై స్వయం సహాయక బృందాల మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. పీఎం సుర్కా బీమా, జీవన్ జ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజనతో వ్యక్తి కుటుంబానికి ఆర్థిక చేయూత అందుతుందన్నారు. బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలన్నారు. బ్యాంకు రీజనల్ హెడ్ రజనీకాంతరావు, డిప్యూటీ రీజినల్ హెడ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



స్థానిక సమస్యలు పరిష్కరించండి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మునీరాబాద్ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామ మాజీ సర్పంచులు వార్డు అధికారికి వినతిపత్రం అందజేశారు. గురువారం మునీరాబాద్ వార్డు కార్యాలయంలో వార్డు అధికారి అశ్వంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గ్రామస్తులు పాల్గొని సమస్యలు విన్నవించారు. గతంలో జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామంగా వెలుగొందిన మునీరాబాద్ గ్రామం మున్సిపాలిటీలో విలీనమైన తర్వాత అధికారుల పర్యవేక్షణ లోపంతో అపరిశుభ్రం, అనేక సమస్యలకు నిలయంగా మారిందని మాజీ సర్పంచులు గణేష్ శ్రీనాథ్‌రెడ్డి, కై రంకొండ గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

ఈఎస్‌ఐ కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు చెల్లించాలి



మల్లాపూర్: నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో పనిచేసే కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది, టెక్నీషియన్లు, వార్డ్‌బాయిలు, శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల 4 నెలల జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహా డిమాండ్ చేశారు. గురువారం కార్మికులకు 4 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా జీతాలు చెల్లించే విషయంలో వివక్షకు గురౌతున్నారని తక్కువ జీతాలు అయినప్పటికీ కాంట్రాక్టర్లు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికశాఖ పరిధిలో ఉన్నటువంటి ఈఎస్‌ఐ ఆస్పత్రిలో కార్పొరేషన్ డైరెక్టర్ లేకపోవడంతో ఆస్పత్రిలో పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. సూపరింటెండెంట్ రాతపూర్వక హమీతో 10 రోజుల పాటు కార్మికులు తాత్కాలికంగా ధర్నాను విరమించారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుకుమార్, రాష్ట్ర నాయకుడు ధన్‌రామ్, ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులు క్రాంతి, భాస్కర్, పద్మ, నిరంకారీ, నరసింహ, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

పోచారం: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎస్‌టీఎఫ్‌సీ బృందం గురువారం స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌డీఎఫ్‌బీ టీమ్ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్ నుంచి బస్సులో నగరానికి గంజాయి వస్తుందన్న సమాచారం ఎస్‌టీఎఫ్‌సీ టీం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అందించారు. దీంతో కొంపల్లి, బాలాజీనగర్, జవహనరగ్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో పోలీసులు స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఘట్‌కేసర్ ప్రాంతంలో నాగ్‌పూర్ నుంచి వస్తున్న బస్సులో ప్రభురాజ్ అనే వ్యక్తి 1.227 కేజీల గంజాయితో పట్టుబడ్డాడు. గంజాయితో పాటు నిందితుడిని నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల కాలనీలో మరో వ్యక్తి..

గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్ట్ చేశారు. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన ప్రభుకుమార్ అలియాస్ వరుణ్ (21) సమీపంలోని వికలాంగుల కాలనీలో బుధవారం రాత్రి గంజాయి విక్రయిస్తుండగా.. ఎస్సై శివకృష్ణ, ఇతర సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. వరుణ్ చిన్నతనంలో తల్లిదండ్రుల చనిపోవడంతో అమ్మమ్మ వద్దే ఉంటున్నాడు. ఐటీఐ చదువుతున్న రోజుల్లో స్నేహితుడు అహ్మద్ ద్వారా గంజాయికి బానిసయ్యాడు. క్రమంగా గంజాయి విక్రయాలు నిర్వహించడం ప్రారంభించాడు. పోలీసుల తనిఖీల్లో అతడి వద్ద 40 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు గురువారం నిందితుడిని రిమాండ్‌కు తరిలించారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

వెంకట్‌రెడ్డి, దమ్మాయిగూడ కమిషనర్



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకట్‌రెడ్డి గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో లేఅవుట్ అభివృద్ధి, భవన నిర్మాణ సంబంధిత పనులను ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రారంభించడం చట్టపరమైన చర్య అన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అభివృద్ధి పనులు చేయకూడదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఊరెళ్లొచ్చేసరికి ఇంట్లో బైక్ చోరీ

ఘట్‌కేసర్: ఊరెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన నాగవల్లి చంద్రమౌళి ఇంటికి తాళం వేసి సొంతూరు వరంగల్‌కు జూలై 29న వెళ్లాడు. బుధవారం రాత్రి తిరిగి ఇంటికొచ్చేసరికి ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి వెండి వస్తువులు, ఓ బైక్‌ను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కీసర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఇంటింటికీ వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, తడి, పొడి వ్యర్థాలు వేరు చేయడంపై అవగాహన, గృహ కంపోస్టింగ్ అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. డీఈఈ బాల మురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలకి చిక్కి.. రూ.50 వేలు పోగొట్టుకుని

మోసపోయిన బాధితుడు

పోచారం: సైబర్ వలకు చిక్కి ఓ వ్యక్తి రూ.50 వేలు పోగొట్టుకున్న ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ ప్రాంతానికి చెందిన కందుల వినోద్ (32) జూన్ 30న జొమాటో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ఫుడ్ ఆర్డర్ చేశాడు. కొద్ది నిమిషాల తర్వాత ఆర్డర్ రద్దు చేసుకున్నాడు. డబ్బు అకౌంట్‌లో తిరిగి క్రెడిట్ కాలేదు. జూలై 2న జొమాటో కస్టమర్ కేర్ నెంబర్‌కు ఫోన్ చేశాడు. వాట్సాప్ కాల్ చేస్తామని చెప్పి కస్టమర్ కేర్ సిబ్బంది ఫోన్ పెట్టేశాడు. వాట్సాప్‌లో లింక్ పంపి బాధితుడితోనే ఓపెన్ చేయించి, అతని ఫోన్‌పే పిన్, బ్యాంక్ అకౌంట్ చివరి 4 అంకెలు నమోదు చేయించారు. వివరాలు ఇచ్చిన తర్వాత తన అకౌంట్ నుంచి 2 దఫాలుగా రూ.47,643, రూ. 2,001, ఇలా మొత్తం రూ. 49,464 డెబిట్ అవడంతో మోసపోయినట్లు బాధితుడు గ్రహించాడు. సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఎస్వీనగర్, బాబానగర్‌కాలనీలో రూ.51 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ చాంబర్ల ఏర్పాటు, వరదనీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కాలనీ అధ్యక్షుడు నెమలి రవికుమార్, వెంకటేష్, రవిచారి, శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నేతలు శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం, రాపోలు శ్రీను పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

మల్లాపూర్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో పిల్లల విభాగాధిపతి, డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆస్పత్రి సూపరింటెండెండ్ డాక్టర్ రమేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిపాలతోనే పిల్లలు ఆరోగ్యవంతులుగా తయారవుతారన్నారు. పుట్టిన పిల్లలకు కనీసం 6 నెలలు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, ఇతర క్యాన్సర్లు రావని పిల్లలు మానసిక శారీరక ఆరోగ్యం కలిగి సంపూర్ణ ఆరోగ్యంతో పెరుగుతారన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డా. రమేష్‌బాబు

ఘనంగా తీజ్ వేడుకలు

కుషాయిగూడ: బంజారాల సంప్రదాయ ఉత్సవం తీజ్ వేడుకలను గురువారం చర్లపల్లి డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరై వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు బంజారాలు సాంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళల ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రభుగౌడ్, నవనీతరెడ్డి, అరుణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.